# భగవంతుని కథ

నాకు పెళ్ళిళ్ళంటే సరదా; ఏ మాత్రం అవకాశమున్నా, ఎవరు పిల్చినా తప్పనిసరిగా వెళ్తాను. పెళ్ళికొడుకు తరపువారైనా, పెళ్ళికూతురి తరపువారైనా...నాకు పట్టింపు లేదు. ఏదో నాకు తోచిన- పెళ్ళికానుక నా శక్తికొలది కొని తీసుకువెళ్తాను. పెళ్ళిసందడి. పెళ్ళి వాతావరణం-అంటే అదో రకమైన పెళ్ళివాసనేమో - నన్ను ఆకర్షిస్తుంది. పెళ్ళి మొదల్నించీ చివరవరకు శ్రద్ధతో చూస్తాను. మనసు కందని ఏదో గొప్పతనం ఉంది పెళ్ళిలో. అసలు పెళ్ళిపందిరే చూడ ముచ్చటగా ఉంటుంది. వాసాలతోనూ, తాటాకులతోను, తోరణాలతోనూ అలంకరించిన ఎంత చిన్న పందిరైనా నన్ను దగ్గరకు రమ్మంటుంది. పెళ్ళంటే ఎందుకంత సంబరం! అని నన్నెవరన్నా అడిగితే నేను ఫలానా అని ఇదమిధంగా చెప్పలేను. ఎందరితోనో కొత్త వ్యక్తులతో పరిచయం అవుతుంది. ఎందరో ఎరగని వాళ్ళు, ఎరిగినవాళ్ళు కనిపిస్తారు. పాలు తాగుతున్న పసిపిల్లలు, ఎప్పుడూ చూడని కన్నెపిల్లలు, యవ్వనాన్ని పులుముకున్న యువతులు, చిరునవ్వులతో అటూ ఇటూ తిరుగుతున్న ప్రౌఢలు- పట్టుచీరలు కట్టుకొని పరిగెత్తుతున్న మరి కొంచెం పెద్దవాళ్ళు- ఇంక మగవాళ్ళలో నిక్కర్ల వాళ్ళూ, పైజామాలవాళ్ళూ, గొట్టం ప్యాంట్లవాళ్ళూ లుంగీలవాళ్ళూ- పెద్దమనుషులుగా ఉండాలని ప్రయత్నించే

భోగపతులు, ఉత్తరీయాలవాళ్ళూ... స్థానిక రాజకీయాలు మొదలు ఢిల్లీ రాజకీయాలవరకూ చర్చించే కొంతమంది నాయకుల్లాంటి వాళ్ళూ- కాలం మారిపోయింది-

—ఆ రోజులే బాగుండేవి అని చప్పరించే తల పండిన తాతయ్యలూ... ఎదురవుతారు.

బాజాభజంత్రీల వాళ్ళూ-మద్దెల సన్నాయి ఈ రెండు కలిస్తే చెప్పక్కర్లేదు. భూమి దద్దరిల్లిపోతుంది. —ఆ తరువాత బ్రహ్మంగారు చదివే మంత్రాలు వినముచ్చటగా ఉంటాయి. ఇలాంటి వాతావరణంలోకి ఓసారి వెళ్ళాను. ఆడపెళ్ళివారు వాళ్లు నాకు చాలా దూరపుబంధువులు. అది మరీ పల్లెటూరు కాకపోయినా పట్నం మాత్రం కాదు. అటూ ఇటూ కాకుండా ఉంది. రైల్వేస్టేషనుకు రెండు మైళ్ళ దూరం. గుర్రం బండ్లు చాలా కొద్దిగా ఉన్నాయి. వంటెద్దు బండ్లే ఎక్కువ. మా బండ్లో ఎక్కమంటే మా బండ్లో ఎక్కమని పోటీపడి... వాళ్ళు గోల చేస్తుంటే నాలో నేను నవ్వుకుని ఓ మంచి వంటెద్దుబండి చూసుకుని పెళ్ళివారింటికి వెళ్ళాను. ఎద్దుబండి ప్రయాణం ఎంతో హాయిగా ఉంది. సాఫీగా వెళ్ళిపోయింది. రిటైరైనవాడి జీవితంలా. పెళ్ళివారింటికి సులభంగా తీసుకెళ్ళగలిగాడు బండివాడు.

అప్పటికే ఉదయం పదిగంటలు దాటింది.

నిప్పురవ్వలు రాజుకుంటున్నట్టుగా ఎండ చిటపటలాడుతోంది. గుమ్మం ముందు ఆడచెప్పులు, మగచెప్పులు, చిన్న

పిల్లల చెప్పులు అనేకం గుమిగూడి ఉన్నాయి నావికూడా గుంపులో కలిసినై.

నన్ను చూడగానే-నన్ను ఎరిగి ఉన్నట్టుగా ఒకాయన ముందుకువచ్చి...ఈ బండికేనా రావడం...ఎన్నాళ్ళకు... ఎన్నాళ్ళకు...మీారు రావడం ఎంతో సంతోషం...అంటూ చిరునవ్వుతో పలకరించాడు ఆయన్ను ఎక్కడో ఎప్పుడో చూసినట్టు గుర్తు.

ఎవరో కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు ఇచ్చారు.

ముహూర్తం దగ్గరపడుతోంది ... సమయానికే వచ్చారు అంటూ మరొకరు పలకరించారు. నాకు సామాన్ల గది చూపించారు. చిన్న బెడ్డింగ్, ఒక లెదర్ సూట్ కేస్ చిన్నది. అది నా సామాను అడుగు పెట్టను సందులేదు. ట్రంకు పెట్టెలు, బెడ్డింగులు, చిన్నచిన్న మూటలు, ఇంకా ఎన్నో సామానులు. ఒక మూలగా సామాను పడేశాను. ఓ చిన్న కిటికీలో ఓ కొబ్బరినూనె సీసా, వెలిసిపోయిన అద్దం, అక్కడక్కడ పళ్ళూడిపోయిన దువ్వెన ఉన్నాయి. అక్కడే బట్టలు మార్చుకుని, ఓసారి దువ్వుకుని అక్కడున్న సామాన్ల మీాదుగా అంగలు వేస్తూ బయటకు వచ్చాను.

ఇంతలో ఎక్కడినుండో దూసుకు వచ్చింది తుఫానులా లలిత.

ఇప్పుడేనా రావడం...ఒక్కడివే వచ్చావేం...ఎన్నాళ్ళకు...ఎన్నాళ్ళకు బావా...అంతా కులాసాయేనా? అంటూ మాటల వర్షం కురిపిస్తోంది. లలిత నాకు మేనత్త

చూశారు. ఏనాటిదో ఈ బంధుత్వం. లలితకు నలభై ఏళ్ళు దాటినా, వెంట్రుకవాసిలో తప్పిపోయింది. లేకుంటే నేనే లలితను పెళ్ళి చేసుకోవల్సింది.

బావా అన్న పిలుపులో ఏదో అనిర్వచనీయ ఆత్మీయత, తియ్యదనం ఉంది.

టిఫిన్ తీసుకుందువుగాని రా బావా అంటూ ముందు వసారాలోకి తీసుకువెళ్ళింది. లలితను చూసి ఏ పదేళ్ళో అయింది. లలిత వాళ్ళు భువనేశ్వర్‌లో ఉంటున్నారుట.

నీ వొక్కడివే వచ్చావేం అని నిలదీసింది.

పిల్లలకు పరీక్షలు...పెద్ద సంసారం కదా...ఇల్లు కదలిరావడానికి ఆవిడకు వీలుపడదు...అన్నాను.

వసారాలో ఈతాకు చాపమీద కూర్చున్నాను. వరుసగా నాలుగైదు చాపలు వేసున్నాయి...చాపలమీద అక్కడక్కడా కాఫీ మరకలు...ఉప్మాతిన్న ఆకులు అక్కడక్కడా గాలికి అటూ ఇటూ కదుల్తున్నాయి...ఇంతలో టిఫిన్, కాఫీ తీసుకోండి...అంటూ ఒకాయన వచ్చి— నా వైపు చూసి చిరు నవ్వు నవ్వుతూ నా ముందు ఉంచి వెళ్ళాడు. అక్కడున్న ఖాళీ ఆకుల మీదకి ఎగబడి, అవి తీసుకుని, ఒక తడిగుడ్డతో చాపమీదున్న కాఫీ మరకలు తుడిచి గిరుక్కున తిరిగి వెళ్ళాడు అతనెవరో నాకు అంతు బట్టలేదు. అతన్ని చూసి అతని వయసు కనుక్కోవడం కష్టం. జుట్టు ముగ్గుబుట్టలా ఉంది కాబట్టి యాభై ఏళ్ళదాకా అంచనా వేయవచ్చు. అతను వేసుకున్న బట్టల్ని బట్టి పెళ్ళికి

సంబంధించిన బంధువర్గంలోని వాడేమోనని అన్పించలేదు. పోనీ పనివాడేమో అనుకుంటే, పనివాడి లక్షణాలు కన్పించలేదు. పనివాళ్ళెవరూ అంత చురుగ్గా పనిచేయరు. క్షణం విరామం లేకుండా పనిచేస్తున్న బాగా అలసి ఉన్నాడు పెదిమల మీద చిరునవ్వు, నుదుటి మీద చెమట బిందువులు...

ఎక్కడ బడితే అక్కడే అతను కన్పిస్తున్నాడు. కొంత సేపు పందిట్లో - కొంతసేపు వంట సావిడిలో ఏదో వంట వాళ్ళకు పురమాయిస్తున్నాడు-కాస్సేపటికి మళ్ళీ వసారాలో కన్పిస్తున్నాడు. అతని వాలకం చూస్తే తన చేతి మీదుగా పెళ్ళి జరిపిస్తున్నట్టుగా ఉంది. అతనిలో ఉన్న ఉత్సాహాన్ని చూసి అతనెవరో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. అయినా పెళ్ళిళ్ళలో ఎవరి హడావుడి వాళ్ళది.

పెళ్ళి కొడుకూ, పెళ్ళి కూతురూ, ఒకరి మీద ఒకరు తలంబ్రాలు పోసుకుంటున్నారు. కన్యాదాత బాగా అలసి ఎందుకో నీరసంగా కన్పిస్తున్నాడు. కళ్ళు బాగా లోతుకు పోయినట్లున్నాయి. ఇంత కట్నం పొయ్యాల్సి వచ్చిందె అని కళ్ళెర్ర చేసిన వానిగా ఉన్నాయి అతని కళ్ళు.

వచ్చిన వాళ్ళందరూ తెచ్చిన కానుకలు చదివిస్తున్నారు. బ్రహ్మగారు ఇచ్చిన వాళ్ళ పేర్లూ, బంధుత్వమూ ఎనౌన్సు చేస్తూ కానుకలన్నీ వాళ్ళకు అందచేస్తున్నాడు. పెళ్ళి కూతురు వెనకాల ఒక గౌనుపిల్ల, బహుశ చెల్లెలేమో. ప్యాకెట్స్ కొన్ని విప్పి కుతూహలంగా చూస్తోంది.

పెళ్ళి హడావుడి అంతా అయిపోయింది. పెద్ద పూల వాన కురిసి వెలసినట్లుగా ఉంది. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చాడు. ఎండ తీక్షణత ఎక్కువవుతోంది.

కొంతమంది వచ్చి అక్కడున్న జంపకాణాలు దుప్పట్లు, చాపలు. అన్ని విదిలించి...ఆ స్థలాన్ని పరిశుభ్రం చేసి వడ్డనకు సిద్ధం చేస్తున్నారు.

భగవాన్లూ భోజనాల వేళ అయిందయ్యా. ఆ ఏర్పాట్ల సంగతి కొంచం చూడు. అంటున్నాడు కన్యాదాత.

భగవాన్లెవరో నాకిప్పుడు తెలిసింది. ఈ ఏర్పాట్లన్నీ అతని చేతిలో ఉంటే అంతకన్న ఏం కావాలి! యుద్ధ రంగంలో కమేండర్లల్లే అన్నీ చకచకా అయిపోతాయి. కమాండరు సామాన్యంగా తనేమీ చేయడు. కాని భగ వాన్లు అలాంటి కమాండరు కాదు తనే ఎక్కువగా చేస్తాడు. ఇతర్ల చేత చేయిస్తాడు. ఇంత శ్రమశిక్షణ దేశంలో అందరికీ ఉంటే దేశం ఎప్పుడో బాగుపడేది. ఈ భగవాన్లు పొద్దున నాకు టిఫిన్ కాఫీ ఇచ్చినాయనే. భగవాన్లను చూస్తున్నాను. నన్నిందులో ఇతను ఆకర్షించాడు. ఇంతపని చేస్తున్నా అతనిలో విసుగు అన్నది ఎక్కడా కన్పించడం లేదు.

అతను నడుం కట్టాడు. విస్తళ్ళు, గ్లాసులు, వరసలో టపటపా పడ్తున్నాయి క్రమంలో. కొందరమ్మలక్కలు పప్పూ, పచ్చడి కూరలు వేసుకున్నారు. వాళ్ళలో లలిత కూడా కన్పించింది. నాకు సరదా వేసింది. ఇంతమంది

ముందుకు వచ్చి పన్లు చేస్తుంటే నేను మాత్రం ఆ సైన్యంలో ఎందుకు చేరగూడదూ నడుం కట్టాను. భగవాన్ల దగ్గరగా వెళ్ళి నిల్చున్నా.

మీరెందుకులేండి బాబుగారూ... మీరు పెద్దవారు. మీరలా ఉండండి. మేం చూసుకుంటాంగా అన్నాడు. ఆప్యాయంగా, ఒక్కపట్టు పట్టామంటె చిటికెలో అయిపో తుంది. అంతమంది ఒకసారి భోజనం చేయడానికి స్థలం లేదు, అన్నాడు.

అదేం లాభంలేదు. ఆయన కూడా నడుం వంచా ల్సిందే అంది లలిత.

రంగంలోకి దిగక తప్పలేదు.

నాకింత బరువుని వప్పగించి, నీవు తేలిగ్గా నెయ్యి మాత్రం తీసుకుంటావా అన్నాను లలితతో.

లలిత ఫెళ్ళున నవ్వింది. అదే నవ్వు. అదే చిలిపి తనం. ఎన్నేళ్ళు వచ్చినా ఇది మాత్రం మారలేదు. నాకు చిన్నతనం జ్ఞాపకం వచ్చింది.

భగవాన్లు నడుపుతూ, నడిపిస్తున్నాడు రంగాన్ని, చకచకా సాగిపోతున్నాయి వడ్డనలు.

ఒక పంక్తి అయిపోయింది. అందరూ త్రేంచుకుంటూ లేచారు. గబగబా పనివాళ్ళు విస్తళ్లు తీసేశారు. భగవాన్ల సహాయంతో.

బాబుగారూ మీరు ఈ పంక్తికి కూచోండి. మేం చూసుకుంటాంగా అన్నాడు భగవాన్లు.

అతని పాట తీసేయలేక నేను కూర్చున్నాను. అదీ గాక బాగా ఆకలి వేస్తున్నది. తప్పలేదు. భగవాన్లుకు మరింత ఉత్సాహం ఎక్కువయింది. రంగంలో కలియబడ్డాడు. టైము రెండూ గంటలు కావస్తోంది.

భోజనం చేసి భుక్తాయాసంతో ఓ మూల పడు కున్నాను. నిద్ర పోవడం లేదుగాని మూడో పంక్తి భోజ నాలు గమనిస్తున్నాను. తాంబూలం నెమరేస్తూ భగవాన్లలో అదే ఉత్సాహం. అదే పరుగు అదే చిరునవ్వు. నుదుటి మీద చెమట అలసట, ఆకలీ లేని ఈ భగవాన్లెవరు? నిజంగా భగవంతుడా అనిపించింది. నాలుగో పంక్తికి వంట వాళ్ళూ, ముసలమ్మలూ, ఇంకా మిగిలిపోయిన వాళ్ళూ కూర్చున్నారు. ఎక్కడా ఉత్సాహం పరుగూ కన్పించటం లేదు. ఆయాస పడుతూ కొంతమంది పిల్లలు ఏడ్పిస్తున్నారు.

నా కళ్ళు భగవాన్ల కోసం వెతుక్కున్నై. వడ్డన లోనూ లేడు. కూచున్న పంక్తిలోనూ లేడు. మూడు గంటలయింది. ఏ తెల్లవారు జామునో పని ప్రారంభించి ఉంటాడు. ఇంతవరకు విధి విరామం లేకుండా పనిచేశాడు. చివరకు మనిషే మాయం అయ్యాడు. నేను ఒకరిద్దరిని అడి గాను. ఏమో అంటే ఏమో అనుకున్నారు. ఎవరో భగ వాన్ల కోసం వచ్చారు. వాళ్ళతో ఏమో మాట్లాడాడు వెంటనే వెళ్ళిపోయాడన్నారు ఎవరో వెళ్ళిపోయాడని నాకు చింతలేదు. కాని భోజనం చెయ్యకుండా వెళ్లాడని నాకు చాలా బాధగా వుంది. అతన్ని గురించి చాలాసార్లు అను

కున్నాను. మరి కొంచెం సేపటికి నా నెక్లెస్ పోయిందండీ అంటూ ఒకామె వచ్చింది. చెమటకు మెళ్లో మరీ గుచ్చుకుంటుంటే మధ్యాన్నం పెట్టెలో పెట్టిందట. భోజనాలయిన తరువాత మళ్ళీ చూసుకుంటే లేదట. లబోదిబో అంటోంది ఆమె.

మరీ సోద్యం పెట్టెలో పెట్టింది ఎలా పోతుందమ్మా అన్నది మరో వనిత. నాకాశ్చర్యం వేసింది. పట్టపగలు ఇలాంటిది జరిగిందంటే.

నలుగురూ చేరారు. చర్చ జరిగింది.

ఈ విషయం కన్యాదాత వరకూ పోయింది. ఆయన నొచ్చుకున్నాడు. శుభమా అని పెళ్ళి జరిగిన ఇంట్లో ఇలాంటిది జరగడం.

ఆ భగవాన్లు తీసేడేమో...ఉన్నట్టుండి కనపడకుండా వెళ్లాడు. అని మరోరన్నారు.

కన్యాదాతకు బాధ బాధతోపాటు కోపం కూడా కలిగింది.

అతను దేవుడిలాంటివాడు. అతనిని ఆ మాటలంటే మహా పాపం అన్నాడు.

అలాటి వాళ్ళే ఇలాంటి పనులు చేసేది. అంటూ ఒకామె మూతి విరిచింది...

పైకి అందరూ మర్యాదస్తులు లాగానే కనపడుతున్నారు. ఎవరిని అనుమానించడానికి ధైర్యం చాలటంలేదు.

ఈ భగవాన్లెవరండీ...అన్నాను కన్యాదాతతో.

భగవాన్లు ఇతరులకు సాయం చేసేవాడేగాని ఇతర్ల దగ్గరనుండి ఆశించే రకం కాదు. అని ముక్తసరిగా అన్నాడు కన్యాదాత. నాకు భగవాన్ల మీద అభిమానం పెరిగింది.

భగవాన్లు భోజనం చేయకుండా వెళ్ళాడు— పొద్దున్నుండీ పచ్చిగంగ కూడా ముట్టలేదు. నాకదే కొరతగా ఉంది. పెళ్ళంతా అతని చేతిమీదగానే జరిగింది. అన్నం కూడా తినకుండా నాకింత అన్యాయం చేస్తాడా! నేనేం పాపం చేశానని...అని అన్నాడు కన్యాదాత. ఆయన కళ్ళు చెమర్చినయి.

నెక్లెస్ సంగతి తేలలేదు. ఆడవాళ్ళ కొంతమంది పోట్లాడుకుంటున్నారు. కొంతమంది ఘర్షణ పడుతున్నారు. ఎవరూ భగవాన్లను గురించి అనుకోవటం లేదు కన్యాదాత తలమీద చేయి పెట్టుకొని ఓ మూలగా వెళ్ళి మౌనంగా కూర్చున్నాడు.

సాయంత్రం అవుతోంది. సూర్యుడు కూడా చెప్పకుండా వెళ్ళిపోయే ప్రయత్నంలో మబ్బుల చాటున కొండల చాటునా దాక్కుని కనపడీ కనపడనట్టుగా ఉన్నాడు. నేనటు వెళ్ళాను.

"కూచోండి" అని సౌంజ్ఞ చేశాడు.

"ఈ భగవాన్లు ఎక్కడ ఉంటాడు?" అన్నాను.

"అతని మకాం శివాలయంలో" అన్నాడు.

"అదెక్కడ?" అన్నాను.

"మీరు స్టేషన్ నుండి వస్తుంటే అంకమ్మ చెట్టు ఉంది

చూశారా! సెంటర్‌లో ... దానికి తూర్పుగా ఓ సందు ఉంది. ఆ సందులోంచి వెళ్తే కోసాన ఉంది...

నాకు నెక్లెస్‌ను గురించి ఆరాతీయటం కన్నా - భగవాన్లను గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువయింది.

శివాలయం వైపు వెళ్ళాను

అది శివాలయం కాదు. శిథిలాలయంలా ఉంది. ఏనాటిదో ఈ శివాలయం బయట గోడలన్నీ పుచ్చిపోయిన శరీరంలా ఉన్నాయి. లోపల ఆకాశాన్నంటుతున్న ధ్వజస్తంభం - దానిముందు చెవి విరిగిపోయిన పెద్ద నంది కొట్ట వచ్చినట్టుగా ఉన్నాయి. గుడి చుట్టూ ప్రదక్షిణ చేశాను. గుడి ఆవరణ పెద్దది. నరసంచారం ఎక్కువగా ఉన్నట్టు కనపడదు. మంచి మంచి చెట్లు ఉన్నాయి. పొగడ చెట్టు శివుణ్ణి పొగుడుతూ ఉన్నట్లుగా ఉంది. మృధువైన వాసన దేవగన్నేరు దానిపక్కనే, అటువైపుగా చిటికేశ్వర చెట్టు' చెట్లనిండా పూలు. ఓ మూల అరుగులాంటిది ఉంది. పెరటి వైపుగా గర్భగుడికి దూరంగా ఓ బావి ఉంది. ఆ బావినీళ్ళు తియ్యగా ఉంటాయిట. అప్పుడే పూజారి వచ్చి గుడి తలుపులు తీస్తున్నాడు.

గర్భ గుడిలోకి వెళ్ళి శివుని దర్శనం చేసుకున్నాను.

పూజారి ఇచ్చిన విభూది కొంచెం తీసుకొని నుదుట రాసుకున్నాను. దేవగన్నేరు పువ్వు చెవులో పెట్టుకున్నాను. పళ్ళెంలో పదిపైసలు వేశాను.

అరుగుమీద వచ్చి కూర్చున్నాను. పూజారితో

మాట్లాడుతుంటే భగవాన్లను గురించి మరి కొన్ని విష యాలు తెలిసినై.

భగవాన్ల అసలు పేరు భగవంతుడట. కొంతమంది అతన్ని భగవాన్లూ అనీ, భగవాయ్ అనీ పిలుస్తారు. అతను ఏనాటివాడో ఎవరికీ తెలియదు. ఆ వూళ్ళో నీటి ఇబ్బంది ఉంది. ఆ వూళ్ళో చాలా మంది శివాలయం బావినీటి మీద ఆధారపడి ఉంటారు. నీటి కావిడి తీసుకొని కొంత మందికి నీళ్లు సప్లయ్ చేస్తుంటాడు భగవాన్లు. బిందెకు అణా చొప్పున ఇస్తుంటారు. భగవాన్లు ఎప్పుడూ శివాలయంలోనే మకాం. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడడు. పరోపకారమే అతని ధ్యేయంగా అనిపిస్తోంది. ఎప్పుడూ ఎవరో ఒకరు అతన్ని పిలుస్తుంటారు. అతను నిలబడితే ఏపనైనా నిరాఘాటంగా జరిగిపోతుంది. అతనుంటే కొండంత బలం. ఆపదలో ఉన్న వారిని ఆదుకోడమే అతని ఆశయం. ఎవ్వరి దగ్గరనుండీ ఏవీ ఆశించడు. ఎవరైనా ఏదైనా ఇస్తే కృతజ్ఞతతో తీసుకుం టాడు. బతికున్న వారికన్న చనిపోయిన వాళ్ళకు అతని అవసరం ఎక్కువ. దగ్గరుండి అన్ని కర్మకాండలు చేయిస్తాడు. అవసరమైతే శవాన్ని మోసుకు పోవడంలో సహాయ పడ్తాడు. చచ్చిపోయినవాళ్ళు తనతో మాట్లాడలేరు గనుక వాళ్ళకే ఎక్కువ సహాయం చేస్తాడేమో...

ఆ ఊరు ఓసారి చూద్దామని శివాలయం నుండి బయలుదేరి వెళ్ళాను. ఆ వూళ్లో పది పన్నెండు వీధులకన్నా ఎక్కువ లేవు.

శివాలయం వీధి దాటి పడమటి వైపుగా వెళ్లాను. దాన్ని కోటబజారు అంటారుట. ఎప్పుడో ఇక్ష్వాకులనాడు అక్కడ ఓ రాజావారుండేవారుట. దోవలో మట్టికోట కన్పించింది. షుమారు శివాలయం వయస్సుంటుంది ఆ కోటకు.

కోట బజారు గుండా చివరకు వెళ్ళాను. ఓ పెంకుటింటి ముందు కొంచెం జనం ఉన్నారు. అందరూ హడావిడిగా ఉన్నారు.

శవ ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యాస్తమయం అవబోతూంది. త్వరగా కానివ్వండి అంటున్నారెవరో. దగ్గరకు వెళ్లి చూశాను. అది భగవాన్ల గొంతే. అంతా భగవాన్లే నడిపిస్తున్నట్లుగ ఉంది. ఆ పెంకుటింట్లో పెద్దగా ఏడ్పులు వినిపిస్తున్నాయి. ఊరుకోండమ్మా అంతగా బెబ్బేలు పడిపోతే ఎలా! ఏడిస్తే పోయినాళ్ళు తిరిగొస్తారా ఆఖరు క్షణాల్లో ఆయన్ను ప్రశాంతంగా పోనివ్వండి. అంటున్నాడు భగవాన్లు, శవ వాహనం భగవాన్ల భుజం మీదకు లాక్కున్నాడు ఇంకా ముగ్గురున్నారు. శివా శివా అంటూ కదిలారు ఊరికి ఉత్తరం వైపు, నా కళ్ళు చెమ్మగిలినై... మూడో బంతి భోజనాలయిం తరువాత భగవాన్ల కెవరో కబురందించి ఉంటారు. పెళ్ళింట్లో చావు మాట చెప్పడం ఎందుకని ఎవ్వరికీ చెప్పకుండా జారుకున్నాడు. అతనికి పెళ్ళి. చావు రెండూ సమానమే. అందరికి కావలసింది సహాయం.

అతను చేయవలసింది సహాయం. అన్యాయంగా నెక్లెస్ తీశా డేమోనని అభాండం వేశారు. పాపం! అన్నమే అక్కర్లేని వాడు నెక్లెస్ కొరుక్కు తింటాడా? ఆ అమ్మలక్కల్లో ఎవరో ఒకరు నెక్లెస్ తీసి ఉంటారు.

నాకు కలిగిన అనుభూతిని తలుచుకుంటూ, అంకమ్మ చెట్టుమీదుగా, బరువుగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరాను. భగవాన్లు నా కళ్ళల్లో మెదుల్తున్నాడు.

వ సు ధ